క్లుప్తంగా

జాతీయ చేనేత దినోత్సవానికి కొత్తపల్లి వాసి


సత్యనారాయణ

కొత్తపల్లి: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని కొత్తపల్లికి చెందిన చేనేత కార్మికుడు పొన్నగంటి వీర వెంకట సత్యనారాయణకు ఆహ్వానం అందింది. ఈ మేరకు కేంద్ర చేనేత, సహకార మంత్రిత్వ శాఖ నుంచి ఆయనకు లేఖ వచ్చింది. సత్యనారాయణ ఢిల్లీలో జరిగే వేడుకల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి. జిల్లాలో చేనేత కార్మికుల సమస్యలను ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారంలో ముందుండటంతో ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా సత్యనారాయణ ప్రధాని మోదీ పాల్గొనే హ్యాండ్లూమ్ సెలబ్రేషన్స్‌లో పాల్గొనున్నారు.

సీఎంఆర్ఎఫ్ పంపిణీ


బాధితురాలికి ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదల అయిన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప మంగళవారం బాధితురాలికి అందజేశారు. హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన తలారి ప్రియాంక అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది గ్రామ నాయకుల ద్వారా ఎమ్మెల్యే సిఫార్సుతో సీఎం సాయానికి దరఖాస్తు చేసింది. ఈ మేరకు రూ.42,250 ఆర్థిక సాయం విడుదల కావడంతో ఆ మొత్తాన్ని ప్రియాంకకు అచ్చంపేటలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

దాత ఆశయాల మేరకు సేవలు

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బంగారు చిన శోభనాద్రి సత్రం ఈఓ చింతపల్లి విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని సత్రంలో మంగళవారం విద్యార్థులకు ఉచిత భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఏటా సుమారు 150 మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతో పాటు వివిధ జిల్లాల విద్యార్థులకు కాకినాడలో ఉంటూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్నారన్నారు. వారికి రెండు పూటలా ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. దాత సత్రానికి ఇచ్చిన వ్యవసాయ భూమి, సత్రం ఆవరణలో ఉన్న షాపుల ద్వారా వచ్చే ఆదాయంతో ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్రం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

17న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

బోట్‌క్లబ్: సంస్కార భారతి ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 9 గంటలకు స్థానిక విద్యుత్‌నగర్ చల్లా కల్యాణమండపంలో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి రాజారావు మంగళవారం తెలిపారు. మూడు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. మూడేళ్ల లోపు వారిని సబ్ జూనియర్స్‌గాను, 4 నుంచి ఆరేళ్ల లోపు జూనియర్స్ గాను, 7 నుంచి పదేళ్ల లోపు వారిని సీనియర్స్‌గా పరిగణించి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్స్ ఆహార్యం, నడక, కృష్ణుని శ్లోకం చెప్పాల్సి ఉంటుందన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 94412 38911, 94415 63789 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

'మన మిత్ర'తో ప్రభుత్వ సేవలు

కరప: గ్రామ సచివాలయాలకు వెళ్లకుండానే మన మిత్ర యాప్ ద్వారా ఇంటివద్ద నుంచే ప్రభుత్వ సేవలు పొందవచ్చని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. కరపలో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర యాప్) గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ పంచాయతీ, సచివాలయాల సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మన మిత్ర యాప్ గురించి వివరించే కరపత్రాలను పంచారు. ఎంపీడీఓ అనుపమ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లలో మన మిత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దానిద్వారా విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించవచ్చో, గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలను ఎలా పొందవచ్చో వివరించి, అవగాహన కల్పించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, గ్రామ కార్యదర్శి యు.నిర్మలాదేవి, డిజిటల్ అసిస్టెంట్ రమ్య, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్‌కు ప్రింటర్ బహూకరణ

బోట్‌క్లబ్: స్థానిక శ్రీరామ్‌నగర్ మున్సిపల్ హైస్కూల్‌కు బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ మంగళవారం తన పుట్టిన రోజు సందర్భంగా కలర్ ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య జన్మదినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, బీజేపీ సెంట్రల్ మండల ప్రధాన కార్యదర్శి జంపన రమణయ్యరాజు, నాయకులు గోడి వెంకట్ పాల్గొన్నారు.


పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ పాఠశాల వద్ద బైక్‌లతో యువకుల హల్‌చల్, భీతిల్లి పక్కకు తప్పుకొంటున్న విద్యార్థినులు

కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లూ.. కళ్లాలే లేనోళ్లు..!

- విద్యా సంస్థల వద్ద పేట్రేగిపోతున్న పోకిరీ బైకులు
- ప్రమాదకర విన్యాసాలు చేస్తూ.. విద్యార్థినుల మీదకు దూసుకు వెళ్తూ..
- ఏమాత్రం పట్టించుకోని పోలీసులు

పిఠాపురం: ఆకతాయిల ఆగడాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. కళాశాలలు, పాఠశాలల వద్ద బైక్‌లతో విన్యాసాలు చేయడంతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో పాఠశాలలకు వచ్చే విద్యార్థినులపైకి దూసుకువస్తుండడంతో వారు హడలిపోతున్నారు. పట్టణంలో మెయిన్ రోడ్డులో జనసంచారం ఎక్కువగా ఉండే పాదా కార్యాలయం సమీపంలో ఆర్ఆర్ బీహెచ్ఆర్ వద్ద నిత్యం పాఠశాలలు ప్రారంభం, విడిచిపెట్టే సమయాల్లో బైకులు హల్‌చల్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే భయమేస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టాల్సిన పోలీసులు అవగాహనా సదస్సులు అంటు హడావిడి చేయడం తప్ప ఆకతాయిల ఆగడాలు పట్టించుకోడం లేదు. ఆకతాయిలను అదుపులోకి తీసుకుని, వారి తల్లిదండ్రుల ఎదుటే ఆ పిల్లల ఘనకార్యాలను వివరించి కౌన్సెలింగ్ ఇవ్వాలని, ప్రతి కళాశాల, పాఠశాల వద్ద రహదారి స్పష్టంగా కనపడేలా సీసీ కెమెరాలు పెట్టాలని, ఆకతాయిలను నియంత్రించాలని ఆడపిల్లల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం


జెండా ఊపి ఆర్మీ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఆర్మీ అధికారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని మంగళవారం కలెక్టర్ షణ్మోహన్ ఆర్మీ అధికారులతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా షణ్మోహన్ మాట్లాడుతూ ఈ ర్యాలీ ఆగస్టు 20 వరకు కొనసాగుతుందన్నారు. ఈ నియామక ర్యాలీ నిర్వహణకు అవసమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల నుంచి 10 వేల మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. తొలిరోజు సుమారు 700 మంది అభ్యర్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెడితే ధ్వంసం చేస్తాం


సామర్లకోట ఈపీడీసీఎల్ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు


పెద్దాపురంలో విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజావేదిక నాయకులు

సామర్లకోట: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద వామ పక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వామపక్ష నేతలు పెదిరెడ్ల సత్యనారాయణ, కరణం ప్రసాదరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వేస్తున్న సమాచారం తమకు ఇస్తే వెంటనే వాటిని ధ్వంసం చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న మీటర్ల ద్వారా నెలకు రూ.400 బిల్లు వస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా రూ.వెయ్యి వస్తుందని, వాటిని ఏర్పాటు చేస్తే విద్యుత్‌ను ముందుగా రీచార్జి చేసుకోవలసి ఉంటుందని, కొనుక్కున విద్యుత్ అయిపోయిన వెంటనే ఇంటిలో సరఫరా ఆగిపోతుందని పేర్కొన్నారు. ఇదే జరిగితే వృద్ధులు, చిన్నారులు, చదువులేని వారి పరిస్థితి ఏమిటో ఆలోచించాలని అన్నారు. గతంలో దీనిని వ్యతిరేకించిన చంద్రబాబు, లోకేష్‌లు నేడు బలవంతంగా ఏర్పాట్లు చేయిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ప్రజా సంఘాల నాయకులు మడగల రమణ, పెదిరెడ్ల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ ఉప కేంద్రం సమీపంలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనంతరం ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ఏఈఎస్‌డీఎస్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజా వేదిక కన్వీనర్ సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లు వేస్తుంటే వ్యతిరేకించిన కూటమి నేతలు ఇప్పుడు ఎక్కడున్నారన్నారు. మొత్తం విద్యుత్ రంగాన్ని ఆదానీకి అప్పగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని వ్యతిరేకించాలని ఆయన కోరారు. అనంతరం వినియోగదారుల సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు చింతల సత్యన్నారాయణ తదితరులతో పాటు విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వడ్డి సత్యనారాయణ, నీలం శ్రీను, గూనూరి రమణ, అప్పన్న, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న విద్యుత్ ఉప కేంద్రం సమీపంలో మంగళవారం ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.అప్పారెడ్డి, నాగేశ్వరరావు, సాంబశివకుమార్, పద్మాకర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి


ఆర్డీఓ శ్రీరమణికి వినతిపత్రం అందజేస్తున్న నియోజకవర్గ జర్నలిస్టులు

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి కాలయాపన చేయడం తగదంటూ జర్నలిస్టులు రోడ్డెక్కారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా జర్నలిస్టుల డిమాండ్‌డేను పురస్కరించుకుని ఐజేయూ సభ్యులు రాకుర్తి రాంబాబు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శించారు. నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట జర్నలిస్టులు మంగళవారం స్థానిక మున్సిపల్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కె.శ్రీరమణికి వినతిపత్రాన్ని అందజేశారు. సీనియర్ జర్నలిస్ట్ అడపా వెంకట్రావు, మొల్లు సూర్యనారాయణ, ఎస్‌పీఎస్ వినాయక్, పెమ్మాడి వీరభద్రవర్మ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఉండే మీడియాపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన అక్రెడిటేషన్లు గడువు పెంచడం మాని ప్రస్తుతం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు కొత్తవి మంజూరు చేయాలన్నారు. ఒకొక్కరికి మూడు సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. బీహార్ తరహాలో జర్నలిస్టులకు పింఛన్ పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఐజేయూ సభ్యుడు రాకుర్తి రాంబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి చవ్వాకుల ఈశ్వరరావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి చంద్రపాటి దాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎలిశెట్టి సత్యన్నారాయణ, జి.సుబ్రహ్మణ్యం, ఎస్‌పీఎస్ వినాయక్, ఎస్.శ్రీరామ్, అడ్డగర్ల సురేంద్ర, బి.బుజ్జిబాబు, ఆర్.వీరబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి ఫర్ ద పీపుల్ పౌండేషన్ చైర్మన్ గుణ్ణం లక్ష్మణరావు, సీఐటీయూ నాయకులు డి.క్రాంతి కుమార్, నీలపాల సూరిబాబు, సిరపురపు శ్రీనివాస్ తదితరులు మద్దతు తెలిపారు.

హైవేపై బొగ్గు లారీ బోల్తా

ప్రత్తిపాడు రూరల్: పట్టణ శివారు జాతీయ రహదారిపై బొగ్గు లారీ బోల్తా పడింది. తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న బొగ్గు లారీ మినర్వా విద్యాసంస్థల వద్ద ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రాచపల్లి అడ్డురోడ్డు వరకు అర ట్రాఫిక్ నిలిచి పోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

లాభాల బాట

- వరిలో కాలి బాటలతో చీడపీడలు దూరం
- ఎరువులు, మందుల పిచికారీకి అనుకూలం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు
- నియోజకవర్గంలో 12 వేల హెక్టార్లలో సాగు


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది


వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకున్న రైతులు

కొత్తపల్లి: నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలులో సుమారు 12 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. కొత్తపల్లి మండలంలో సుమారు 7234 మంది రైతులు 10,454 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అయితే వరినాట్లు వేసిన రైతులు పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే మేలు జరగడంతో పాటు చీడపీడలను సులభంగా తట్టుకునే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు. దీంతో పాటు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

కాలిబాటల వల్ల లాభాలు

- వరి సాగు చేసే రైతులు తూర్పు, పడమర దిశగా ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాట ఏర్పాటు చేసుకోవాలి.
- మొక్కలకు గాలి, వేలుతురు బాగా అంది చీడపీడలు రాకుండా ఉంటాయి.
- పురుగు నివారణ మందులు పిచికారీ చేసుకునేందుకు సులభంగా పండేందుకు వీలు ఉంటుంది. ప్రతి మొక్కపైన మందు సులభంగా పడేందుకు వీలు ఉంటుంది. ఒక పక్క ఎక్కువ మరో పక్క తక్కువగా మందు పిచికారీ అయ్యే ప్రమాదం ఉండదు.
- ఎరువులను సులభంగా చల్లుకునేందుకు వీలు ఉంటుంది.
- వరిమడిలో భూమి తడి లేకుండా సులభంగా ఆరబెట్టేందుకు వీలవుతుంది.
- వరికోత సమయంలో సులభంగా కోతలు కోసుకునేందుకు అనువుగా ఉంటుంది.

ఏర్పాటు చేసుకుంటున్నాం



నేను చాటా కాలం నుంచి ఏటా వరి సాగు చేస్తున్నాను. మడిలో క్రమం తప్పకుండా కాలి బాటను ఏర్పాటు చేసుకుంటున్నాను. దీనిపై సులభంగా ఎరువులు, మందులను పిచికారీ చేసుకునే వెసులు బాటు ఉంటుంది. మొక్కకు తగినంత గాలివెలుతురు తగలడం వల్ల ఏపుగా పెరుగుతుంది.

– రొంగల వీరబాబు, రైతు, గోర్స

అవగాహన కల్పిస్తున్నారు



కాలి బాటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు తెలియజేస్తున్నాం. దీంతో దాదాపు అందరు రైతులు కాలిబాటలను ఏర్పాటు చేసుకుంటున్నారు. బెంగాలీ కూలీలు వరినాట్లు వేసే సమయంలోనే బాటలు వేస్తున్నారు. వరి పంటపై పాటించాల్సిన జాగ్రత్తలను అధికారులు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు.

– గంధం సత్యనారాయణ, రైతు, గోర్స

మొక్కలు ఏపుగా పెరుగుతాయి



వరిలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. మొక్కకు కావలసిన గాలి వెలుతురు బాగా తగులుతుంది. దీంతో దుబ్బు బాగా కట్టి మొక్కల సంఖ్య పెరుగుతుంది. వరిపంటకు చీడపీడలు ఆశించగానే కాలిబాటలు ఉంటే సులభంగా మందులను పిచికారీ చేసుకోవచ్చు. రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలు ఇస్తున్నాం. ఏ సమయంలో ఎంత మోతాదులో మందులను ఉపయోగించాలో తెలియజేస్తున్నాం.

– జోగిరాజు, ఎంఏఓ, కొత్తపల్లి

రాష్ట్ర స్థాయి పోటీలకు జెడ్పీ హైస్కూల్ బాలికలు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

సామర్లకోట: రాష్ట్ర స్థాయిలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే క్రీడా పోటీలకు సామర్లకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపిక అయ్యారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి విలేకర్లకు తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ అండర్-14 విభాగం జావెలిన్ త్రోలో సీహెచ్ ఇందిరా ప్రియ దర్శిని, అండర్-16 విభాగం నుంచి రన్నింగ్ పోటీలకు కె.జ్యోత్స్న ప్రియాంక, అండర్ 18 విభాగం నుంచి షాట్‌పుట్ డిస్కస్ త్రోకు సీహెచ్ శృతి, లాంగ్ జంప్‌నకు బి.స్వాతి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. ఈ విద్యార్థులను హెచ్ఎం విజయలక్ష్మి, పీడీలు హవీలా, వరలక్ష్మి, ఉపాధ్యాయులు హనుమంతరావు, లక్ష్మణ్‌దొర, గురుప్రకాష్, విద్యాకమిటీ వైస్ చైర్మన్ పచ్చాకుల లోవరాజు అభినందించారు.

వాస్క్యులర్ వ్యాధులకు సకాలంలో వైద్యం

సర్జన్ డాక్టర్ అమరేంద్రబాబు

కాకినాడ రూరల్: వాస్క్యులర్ వ్యాధులకు సకాలంలో వైద్యం అందించాలని ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎస్ఎస్ అమరేంద్రబాబు పేర్కొన్నారు. నేషనల్ వాస్క్యులర్ డేను పురస్కరించుకుని మంగళవారం కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏటా ఆగస్టు 6న నేషనల్ వాస్క్యులర్ డేను నిర్వహిస్తున్నామన్నారు. మోకాళ్లకు పై లేదా కింద భాగం వరకు తొలగించాల్సిన పరిస్థితులు లేకుండా అవగాహనతో సరైన చికిత్సను చేయించుకుని చిరకాలం జీవించాలన్నారు. ఈ వ్యాధులు ముఖ్యంగా అనేక రోగాలు పాదాల్లో గాయాలు, డయాబెటిక్ ఫుట్ అల్సర్స్, గ్యాంగ్రిన్ వంటి సమస్యలతో బాధపడుతున్నారని, వీటిని సమయానికి గుర్తించి తగిన చికిత్సలు చేస్తే అవయవాలు తొలగించే ప్రమాదం ఉండదని తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో అతి తక్కువ ఖర్చుతో ఈ చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ ఆస్పత్రిలో వాస్క్యులర్ స్క్రీనింగ్ క్యాంప్ ద్వారా రోగులకు ఉచిత సలహా, పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతిభ చూపితే రూ.పది వేలు!

- ఒక్కొక్క విద్యార్థికి ప్రోత్సాహకం
- పాఠశాల స్థాయిలో పరిశోధనలు
- ఇన్‌స్పైర్ మనక్‌కు సెప్టెంబర్ 15 తుది గడువు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్

బాలాజీచెరువు: ఒక ఐడియా చదువులకు భరోసాగా నిలవనుంది. విద్యార్థి చెప్పిన ఆలోచన నిర్వాహకులకు నచ్చితే రూ.10వేలు బహుమతి ఇస్తారు. ఆ డబ్బులతో తయారు చేసిన సైన్స్ సంబంధిత ప్రాజెక్టుతో సదరు విద్యార్థి జాతీయస్థాయి వరకూ నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చు. విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపికైయితే ప్రభుత్వం తోడ్పాటునందిస్తుంది. ఇంత చక్కని అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనుకునే విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డ్స్-మనక్‌లో ప్రాజెక్టుల సారాంశాన్ని ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు సెప్టెంబర్ 15 వరకూ గడువు పెంచారు.

మేధోశక్తికి పదునుపెట్టేలా

విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలలో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు మక్కువ పెంచేలా ప్రభుత్వం ప్రత్యేక తోడ్పాటు అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ పేరిట ఏటా రాష్ట్ర, కేంద్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న మేధోశక్తికి పదునుపెట్టేలా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 2025-26కు ఇన్‌స్పైర్ అవార్డ్స్-మనక్ పేరిట్ సైన్స్ ప్రయోగాలకు విద్యార్థులను సిద్ధం చేస్తూ వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఆలోచన చెబితే చాలు

సృజనాత్మకత, నూతనత్వంతో కూడిన పర్యావరణ హితమైన, సామాజిక, సమస్యల పరిష్కారం సూచించేలా విద్యార్థులు తమ మేధోశక్తిని రంగరించి చక్కటి ఆలోచన చెబితే చాలు. దానిని డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదే సమయంలో విద్యార్థి పేరు, పాఠశాల యూడైస్ కోడ్, రెవెన్యూ జిల్లా, విద్యార్థి బ్యాంక్ ఖాతా నంబర్ పొందుపరచాలి.

ఎంపికైతే ప్రోత్సాహకం

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అన్ని యాజమన్యాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డు కోసం తమ ఆలోచనలు పంపించవచ్చు. 6 నుంచి పదో తరగతి వరకూ 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు గల వారు దీనికి అర్హులు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా స్థాయిలో నియామకమైన కమిటీ విద్యార్థులు పంపించిన అంశాలు పరిశీలించి మంచి ఆలోచనలు ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన విద్యార్థులకు వారి ఖాతాల్లో రూ.10 వేలు జమ చేస్తారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



ఇన్‌స్పైర్‌లో ప్రాతినిధ్యం వహించే విద్యార్థులకు భవిష్యత్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. జిల్లా సైన్స్ అధికారులు ఆయా జిల్లాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు ఎక్కువ మంది చేరేలా కృషి చేస్తున్నాము.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

ప్రతి పాఠశాలా పాల్గొనేలా..



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులను ప్రొత్సహించేలా చర్యలు చేపట్టాం. ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ ప్రాజెక్టు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. గత ఏడాది కంటే అధికంగా పాల్గొనేలా కృషిచేస్తున్నాము.

– ఎం.శ్రీనివాస్ వినీల్, జిల్లా సైన్స్ అధికారి, కాకినాడ